



గంటస్తంభం వద్ద జనాల రద్దీ

వస్త్ర వ్యాపారం @ 100 కోట్లు

- కిక్కిరిసిన కార్పొరేట్ వస్త్ర దుకాణాలు
- వెలవెలబోయిన బాలాజీ మార్కెట్

ఏడాదిలో మొదటి రైతు పండగ.. ప్రతి ఒక్కరూ ఇంటిల్లిపాది చేసుకునే ప్రధానమైన సంక్రాంతి పండగ నేపథ్యంలో నగరంలో వస్త్ర వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజురోజుకూ కార్పొరేట్ వస్త్ర వ్యాపారం నగరంలో పెరుగుతుండగా, ఇదే ప్రధాన జీవనాధారంగా ఉన్న అతిపెద్ద వస్త్ర మార్కెట్ గల బాలాజీ మార్కెట్‌లో షాపులు వెలవెలబోతున్నాయి. ఓవైపు ఆన్‌లైన్ షాపింగ్ పెరగడం, మరోవైపు కార్పొరేట్ షాపింగ్‌మాల్స్ రావడంతో బాలాజీ మార్కెట్‌లో వ్యాపారం ఏడాదికేడాదికి తగ్గిపోతోంది.

జనంతో కిటకిటలాడుతున్న రెడీమేడ్ వస్త్రదుకాణాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతికి పది రోజులు ముందు నుంచీ నేటివరకు నగరంలో సుమారు రూ.100 కోట్లు వస్త్ర వ్యాపారం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గతంలో నూతన వస్త్రాలు కొనుగోలు చేయాలంటే విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాల వారికి గుర్తుకు వచ్చేది విజయనగరంలోని ఉల్లివీధి, బాలాజీ మార్కెట్, ఎంజి రోడ్డులోనే బట్టల షాపులే. ఒకనాడు వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు నేడు కార్పొరేట్ కంపెనీలైన రిలయన్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, డి-మార్ట్, సిఎంఆర్, ఎస్ఆర్ షాపింగ్‌మాల్ తో పాటు రింగ్ రోడ్డులో బ్రాండెడ్ షాపులు అధికంగా ఉండటంతో స్థానిక చిన్న చిన్న వ్యాపారులకు బిజినెస్ తగ్గిపోయింది. వంద కోట్లు వ్యాపారంలో పదుల సంఖ్యలో ఉన్న కార్పొరేట్ కంపెనీల షాపులకు 50 శాతం వ్యాపారం జరగగా, వందల సంఖ్య లో స్థానిక వ్యాపార సంస్థలకు ఉన్న 50 శాతం వ్యాపారం అయినట్లు తెలుస్తోంది. కార్పొరేట్ కంపెనీల దెబ్బకు స్థానిక వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రధాన పండగ కావడంతో నగరంలో చిన్నా,పెద్ద షాపుల్లో శుక్రవారం నాటికి 100 కోట్లు పైనే వస్త్ర వ్యాపారం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. శని, ఆదివారాలు రెండు రోజుల్లో కలిపి సుమారుగా 200 కోట్లకు చేరే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

బాలాజీ మార్కెట్‌లో ఖాళీగా కనిపిస్తున్న వస్త్ర దుకాణాలు

నగరంలో పండగ శోభ

కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగువారి ప్రధాన పండగ అయిన సంక్రాంతి శోభ విజయనగరంలో నెలకొంది. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా కుటుంబ సమేతంగా జరుపుకునే పండగ కావడంతో విజయనగరంలో మార్కెట్ జిల్లా నలుమూలల నుంచి ప్రజలతో కిక్కిరిసి పోయింది. నూతన వస్త్రాలు, పండగకు పిండి వంటలకు కావాల్సిన సరుకుల కొనుగోలు కోసం వచ్చిన జనాలతో నగరం శనివారం కిట కిట లాడింది. ప్రధానంగా కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు నగరంలోని ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మందితో బట్టల షాపులన్నీ కిటకిటలాడాయి. మూడు లాంతర్లు నుంచి ఎమ్‌జి రోడ్డు, కన్యకాపరమేశ్వరి కోవెల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులు కొనుగోలుదారులతో నిండి పోయాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రధానంగా గంటస్తంభం వైపు ట్రాఫిక్‌ను నియంత్రణ చేయడంలో పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో మార్కెట్ లోకి ద్విచక్ర వాహనాల తప్ప పెద్ద వాహనాలు ,ఆటోలు, కార్లు వెళ్లకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

పండగ సామగ్రిని తీసుకెళ్తున్న మహిళ

బస్సులు కిటకిట

రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎక్కడెక్కడో ఉంటూ స్వగ్రామాలకు చేరుకుంటున్న వారితో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. ఆదివారం నుంచి సంక్రాంతి కావడంతో శనివారం వేలాది మందితో ఆర్‌టిసి కాంప్లెక్సు కిక్కిరిసిపోయింది. బస్సులు ఎక్కడానికి ప్రయాణికులు పోటీ పడ్డారు. ప్రధానంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వలస కూలీలు విశాఖ, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్, చెన్నైలో పనులు చేసుకుంటున్నారు. అలాగే ఉద్యోగాలు, చదువు రీత్యా పలువురు ఆయా ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామా లకు వస్తుండ డంతో బస్సులన్నీ కిటకిట లాడు తున్నాయి. ప్రయాణి కులకు సరిపడా బస్సులు లేక పోవడం తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్సులో బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

సంక్రాంతి పండుగ శుభ వేళ రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలు వెల్లివిరియాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి లోగిళ్ళు భోగ భాగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో నిండి, ప్రతీ ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరారు. పంటలు బాగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రైతాంగం కూడా ఎంతో సంతోషంగా ఉందని బొత్స పేర్కొన్నారు.

ప్రతి ఇంటా సంక్రాంతి : కలెక్టర్

ఈ సంక్రాంతి పుణ్య కాలం ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. పంట చేతి కొచ్చే సమయంలో, ఆనందోత్సవాల నడుమ మూడు రోజులు ఘనంగా జరుపుకునే ఈ పండగ ప్రజలందరికీ మధుర స్మృతులను మిగల్చాలని కోరారు. ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు, రైతులకు మేలుజరగాలి : కోలగట్ల

ప్రజలకు, రైతులకు, వైసిపి నాయకులకు, కార్యకర్తలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలతో ప్రతి ఒక్కరు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా ప్రతి కుటుంబం ఆనందంగా వర్ధిల్లాలని కోరారు.

కొనసాగుతున్న కోటి సంతకాల సేకరణ

వేతనం పెంచే వరకు సమ్మె విరమించేది లేదు • 33వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల సమ్మె

డెంకాడ.. ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 33వరోజుకు చేరుకుంది. శుక్రవారం మంత్రులతో జరిగిన చర్చల్లో వేతనాలు పెంచలేమని చెప్పడాన్ని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. కోటి సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి ఇవ్వాలన్న పిలుపు మేరకు జిల్లాలో సంతకాల సేకరణ ఉద్యమం సాగుతోంది. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరీ చేయించుకొని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని కోరితే ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, వేతనాలు పెంచలేమని చెప్పడం దారుణమన్నారు. దీంతో సమ్మెను ఉధృతం చేయనున్నట్లు ప్రకటించారు. గ్రామాల్లో, వీధుల్లో తిరుగుతూ అంగన్వాడీలు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నారు. పండగ వాతావరణంలో కూడా మొక్కవోని దీక్షతో సమ్మెను కొనసాగిస్తూ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. శనివారం విజయనగరంలోని పలు ప్రాంతాలతో పాటు మండలంలోని కొండవెలగాడ, కొండ గుంపాం, ద్వారపూడి గ్రామాల్లో సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో కోటి, శాంతకళ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీల ఉద్యమాన్ని బలపరచండి

విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ 3వ సెక్టార్ జొన్నగుడ్డి వద్ద కోటి సంతకాల కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తమ్మయ్య, సామాజిక కార్యకర్త ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టుదలకు పోకుండా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని లేదంటే పండగ తర్వాత అంగన్వాడీ లతోపాటు లబ్ధిదారులు, ప్రజలంతా రోడ్ల మీదకు రావాల్సి వస్తుందని తెలిపారు. అంగన్వాడీల ఉద్యమాన్ని బలపరుస్తూ ప్రజలంతా సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడ మండల కేంద్రంలో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం నేడు పెంచకుండా, సమ్మె చేస్తున్నందున ఉద్యోగాలు కూడా పీకుతామని హెచ్చరించడం భావ్యం కాదని అన్నారు. ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉంటు ందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి ఎం.కృష్ణ వేణి పి.సుజాత, చిన్నమ్మలు, అనిత, రమణమ్మ పాల్గొన్నారు.

గరివిడి : తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగుతోంది. వీరి పోరాటానికి యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, చీపురుపల్లి మండల అధ్యక్షులు నడిపేన బలరాం, కార్యదర్శి సువ్వాడ కృష్ణమూర్తి మద్దతు తెలిపారు. రూ.5వేలు పోరాట నిధిని చీపురుపల్లి మండల శాఖ తరపున అందజేశారు. పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు టివి రమణ, ఎ.గౌరినాయుడు మాట్లాడారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి న్యాయవాది రమణాజీ, చిట్టి మద్దతు తెలి పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, జి.క్రాంతి, వి.మాణిక్యం, డి.సుశీల, వి.దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

మెంటాడ : మెంటాడలో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మి, మెంటాడ సెక్టార్ నాయకులు రాజ్యలక్ష్మి, జి.సన్యాసమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్.. సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

గరివిడి.. అంగన్వాడీలకు పోరాటనిధిని అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

3 గంటలు ట్రాఫిక్ జామ్

మానాపురం రైల్వేగేటు వద్ద శనివారం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సంక్రాంతి నేపథ్యంలో పట్టణ వాసులంతా పల్లెలకు పయనమవ్వడం, మరోవైపు రైల్వే ఓవర్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో వాహనాలన్నీ రైల్వే గేటుకు ఇరువైపులా బారులు తీరాయి. సుమారు మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.

– ప్రజాశక్తి, దత్తిరాజేరు

కడుబండితో కలిసిరాం

అసమ్మతి గ్రూపు నిర్ణయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుపై నియోజకవర్గంలో వైసిపి అసమ్మతి గ్రూపు.. మరోసారి ఫైర్ అయింది. నియోజకవర్గంలోని వైసిపి అసమ్మతి గ్రూపు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో సమావేశమయ్యారు. 'కడుబండి వద్దు.. జగనన్న ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట ఎంపిపి సండి సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్థానికేతరుడైనా ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకంతో కడుబండిని 2019 ఎన్నికలలో గెలిపించామని తెలిపారు. కొంతమంది భజనపరులకే ఎమ్మెల్యే అవకాశాలు కల్పిస్తూ, ఆయన్ని నమ్ముకున్న ప్రజాప్రతినిధులను, నాయకులను, కార్యకర్తలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఈ విషయమే వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణకు తెలియజేసినా సరైన స్పందన లేదని తెలిపారు. ఈసారి మళ్లీ ఎమ్మెల్యే టికెట్ కడుబండికి కేటాయిస్తే నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్ ఆయనతో కలిసి పనిచేయబోమని తేల్చిచెప్పారు. అవసరమైతే తామంతా రాజీనామాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, సర్పంచ్ జి.సంతోష్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి పతకాలు

ప్రజాశక్తి.-విజయనగరం టౌన్

స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. పల్లవి జాతీయ సీనియర్, జూనియర్ విభాగాల్లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 64కేజీల విభాగంలో రజిత పతకం , కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు గత ఏడాది డిసెంబర్ 28 నుంచి ఈనెల 7 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. శశి భూషణ రావు, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు., విజేతలకు నగదు బహుమతిని కూడా అందజేశారు.



పల్లవిని అభినందిస్తున్న డైరెక్టర్ శశిభూషణరావు

'జగన్‌కు జీవిత శిక్ష తప్పదు'

ప్రజాశక్తి-విజయనగరంకోట

జగన్మోహన్ రెడ్డికి జీవిత శిక్ష తప్పదని విజయనగరం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్మోహన్ రెడ్డి తీరును, పెత్తందారి పోకడలను వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు బహిరంగంగానే ఎండగడుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు నీలి మీడియాతో దుష్ప్రచారాలకు దిగుతున్నారని తెలిపారు. ఆర్థిక నేరస్థుడు, జగన్ పై 38 కేసులు నమోదయి ఉన్నాయని, 43 వేల కోట్లు దోపిడీపై సిబిఐ, ఇడి లు ఛార్జిషీట్లు కూడా వేశాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలకు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళలకు పూర్తిరక్షణ కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి రావాలని తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున జిల్లా ప్రజలకు అభిమానులకు కార్యకర్తలకు నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పబ్లిక్ కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పద్మావతి నగర్ సమీపంలోని వసంత విహార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ వసంత విహార్ ఏర్పాటై దాదాపు 15 ఏళ్లు కావస్తున్నా, ఈ ప్రాంతంలో కనీస అవసరాలకు గుర్తించడం గాని, పరిష్కార మార్గం చూపడం గాని జరగలేదన్నారు. తాను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత స్థానిక ప్రజల వినతిని పరిష్కరించే దిశగా ఈరోజు కుళాయిలను ఏర్పాటు చేసి ప్రారంభించామని అన్నారు. కొత్త ధర్మపురిలో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి అక్కడ నుంచి ప్రత్యేక పై పైపులైన్లు ద్వారా కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి కోలగట్ల కృష్ణారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతి రావు పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న కోలగట్ల

పదవీ యావలు... ప్రజా సమస్యలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు పుట్టెడు సమస్యలతో ప్రజానీకం. మరోవైపు పదవులే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికార ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు. ఎన్నికల ముందైనా తమ సమస్యలు పరిష్కరించకపోతారా? అని ఆశ చూస్తున్న ఉద్యోగులకు నిరాశే ఎదురౌతోంది. ఉన్న హామీలు నెరవేర్చలేదు సరికదా అధికార పార్టీ నాయకులు కొత్తకొత్త హామీలతో ముందుకు వస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలుకు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదు? అని నిలదీయాల్సిన ప్రతిపక్ష పార్టీ నాయకులూ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు లేదా ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవుల హామీల కోసం అధినేతల వద్ద ఎగబాకుతున్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి స్కీమ్ వర్కర్లు, సర్వశిక్షాభియాన్‌లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇలా పలు రంగాలకు చెందిన వారంతా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాదాపు నెల రోజుల నుంచి ఆందోళన చేస్తునే ఉన్నారు. వీరితో చర్చిస్తున్న ప్రభుత్వం కంటితుడుపు హామీలు తప్ప, వారి జీవనంతో ముడిపడివున్న ఆర్థికపరమైన అంశాలను నెరవేర్చడం లేదు. మరోవైపు ధాన్యం రైతులు తాము నిలువ దోపిడీకి గురవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథులు కనిపించడం లేదు. ఎపి రైతు సంఘం నాయకులు మాత్రమే వారి తరపున అధికారులను కలిసి విన్నపాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వీరి సమస్యలను అవగతం చేసుకుని ప్రభుత్వానికి తెలియజేసి, సమస్యల పరిష్కారానికి అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేయడం లేదు. టిడిపికి చెందిన నాయకులు కేవలం ఆందోళన చేస్తున్న వారికి సంఘీ భావం తెలియజేడం తప్ప ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టి రోడ్లపైకి రావడం లేదు. వైసిపి నాయకులు ఓ అడుగు ముందుకేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని మరీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేసి వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. టిడిపి నాయకులు శిబిరాల వద్దకు వెళ్లి, వైసిపి చేయనివన్నీ తాము అధికారంలోకి వచ్చాక చేసేస్తామంటూ ఉచిత హామీలు గుప్పిస్తున్నారు. దీంతో, ఇటు టిడిపి నాయకులుగానీ, అటు వైసిపి నాయకులుగానీ పదవుల కోసం తప్ప ప్రజాసమస్యలపై పనిచేయడానికి రాజకీయాల్లోకి రాలేదని జనం చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులు, ముఖ్యంగా సిపిఎం, సిఐటియు నాయకులు మాత్రమే కార్మికులు, ఉద్యోగులు, ప్రజల తరపున నిఖరంగా ఉన్నారంటూ చర్చ జరుగుతోంది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం

తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా పరిషత్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో అలంకరించి పండగ శోభను కళ్లముందుంచారు. సంప్రదాయ జానపద కళలు కనువిందు చేశాయి. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలంతా సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు కలకాలం నిలుపుకోవాలని కోరారు. రైతులవద్దనున్న ధాన్యాన్నంతటినీ ప్రభుత్వం కొనుగోలు చేస్తూ, వెంటవెంటనే వారికి డబ్బులు చెల్లిస్తోందని, దీనివల్ల రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. జెడ్‌పి సిఇఒ కె.రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతోపాటు, కర్నూలు జిల్లా జెడ్‌పి ఛైర్మన్ వై.పాపిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భోగిమంటలను వెలిగించారు. తప్పెటగుళ్లు, కోలాటం, గంగిరెద్దులను, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మన సంప్రదాయ పిండి వంటలను రుచి చూశారు. సిబ్బందిని అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్‌పి సిఇఒ రాజకుమార్, డిపిఒ శ్రీధర్‌రాజా, శ్రీకాకుళం జెడ్‌పి వైస్ ఛైర్మన్ జగన్‌మోహనరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కెవి సూర్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు, జెడ్‌పి సిబ్బంది, పాల్గొన్నారు.

కనువిందు చేసిన జానపద కళలు

జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

దుస్తులు పంపిణీ చేస్తున్న శివానందకుమార్, విజయకుమారి

దుప్పట్లు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో నాయుడు కాలనీలో పేదలకు విశాఖ జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ కె.శివానందకుమార్, మెట్టవలస జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమారి దుప్పట్లు, దుస్తులు, పులిహోరా ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ కె.లక్ష్మి, నాయకులు కె.సత్యనారాయణ, న్యాయవాది పోల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిఐగా రంగనాథం బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

ట్రాఫిక్ సిఐగా పైడి రంగనాథం శనివారం బాధ్యతలు చేపట్టారు. 2002 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రంగనాథం గతంలో ఉమ్మడి జిల్లాలో ఎస్ఐగా నీలకంఠాపురం, గజపతినగరంతోపాటు పలు పోలీసు స్టేషన్లలో సమర్థవంతంగా పని చేసి, ప్రజలు, అధికారుల నుండి మంచి గుర్తింపు పొందారు. సిఐగా ఉద్యోగోన్నతి పొందిన తరువాత అనకాపల్లి జిల్లాలో సిసిఎస్, సబ్బవరం పోలీసు స్టేషన్లలో పని చేసి గుర్తింపు పొందారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన రంగనాథంను ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, ఎస్ఐలు, సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

బుదరాయవలస ఎస్ఐగా లోకేశ్వరరావు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బుదరాయవలస పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బి.లోకేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇతను సంతకవిటి పిఎస్ నుండి బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన ఎస్ నవీన్ పడాల్ విజయనగరం బదిలీ అయ్యారు.

గంట్యాడ ఎస్ఐగా సురేంద్రనాయుడు

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ ఎస్ఐగా సురేంద్రనాయుడు శనివారం స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. రామభద్రపురం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గంట్యాడ ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు భీమునిపట్నం బదిలీ అయ్యారు.

వంగర ఎస్ఐగా వీరజనార్ధన్

ప్రజాశక్తి - వంగర

స్థానిక ఎస్ఐగా వై.వీర జనార్ధన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఆర్. జనార్ధనరావు బదిలీ కావడంతో ఆ స్థానంలో కొత్తవలస మండలంలో పనిచేసిన ఎస్ఐ వీర జనార్ధన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కషి చేస్తామని తెలిపారు.

నెల్లిమర్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన డి.రామగణేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. రామగణేష్ విజయనగరం 1టౌన్ నుంచి ఇక్కడకు రాగా ఇక్కడ ఎస్ఐగా పని చేసిన పి.నారాయణ రావు జిల్లా కేంద్రంలోని దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రామగణేష్‌ను నెల్లిమర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పతివాడ రాజారావు, పక్కి సురేష్, అల్లి శ్రీనివాసరావు, కలిశెట్టి బాబూరావు, కొండల సీతారాం, కల్యాణం సత్యనారాయణ, రేగువలస భాస్కర్ పాల్గొన్నారు.

భోగి మంట వేస్తున్న తహశీల్దార్

తహశీల్దార్ కార్యాలయంలో ..

ప్రజాశక్తి-జామి

జామి తహశీల్దార్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది భోగి మంటలు వేశారు. కార్యాలయం ప్రాంగణంలో అందమైన ముగ్గులతో సంక్రాంతి శోభ తీసుకొచ్చారు. సంబరాల్లో వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ సునీత, రెవెన్యూ సిబ్బంది సంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు.

ముగ్గు వేస్తున్న సినీనటి పూజామూర్తి

'వాజీ' ఆధ్వర్యాన రంగోలీ పోటీలు

విజేతలకు బహుమతులు పంపిణీ • ప్రత్యేక ఆకర్షణగా సినీనటి పూజామూర్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు రంగోలీ పోటీలు అని వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉదయం ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో వాజీ ఛానల్ నిర్వహించిన రంగోలి పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళల సృజనాత్మకతకు అద్దం పట్టాయి. వందలాది మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. పల్లె అందాలు, సంక్రాంతి సొగసులు ప్రస్ఫుటమయ్యాయి. అతిథిగా విచ్చేసిన ప్రముఖ టీవీ, సినీనటి పూజామూర్తి (గుండమ్మ కథ ఫేమ్) సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గు వేయడం మన సంప్రదాయంలో ఒక భాగమని, మగువల చేతుల్లోంచి అలవోకగా నేలపైకి జాలువారి, చూపరులను కట్టిపడేసే అద్భుతమైన, అందమైన ఒక నైపుణ్యం ముగ్గు అని అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా భారతీయ సనాతన సాంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో భాగంగా మహిళలను ప్రోత్సహించేందుకు రంగోలీ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

'సాయి రంగా'లో సంక్రాంతి సంబరాలు

శృంగవరపుకోట : మండలంలోని పోతనపల్లి గ్రామంలో సాయిరంగా పాలిటెక్నిక్ కళాశాలలో యాజమాన్య ప్రతినిధి రుష్యేంద్ర ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో రవి నాయుడు, కిరణ్, గణేష్, స్వామి నాయుడు, విజయలక్ష్మి, మోహన్, ఝాన్సీ, అరుణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధిలోని సీతమ్మ పేటలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ప్రారంభించారు. అనంతరం యువతకు టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి నాగిరెడ్డి రమణాజీ, టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, కాళిదాసు, చక్క కిరణ్‌కుమార్, కాపుగంటి వాసు, వార్డు మెంబర్ పెదగాడ రాజు, జి.రోహిణీ కుమార్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-వేపాడ

సంక్రాంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన శనివారం నియోజకవర్గంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. వేపాడ మండలంలోని వల్లంపూడి సచివాలయం వద్ద టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన నిర్వహించిన ముగ్గుల పోటీలకు భారీగా మహిళలు హాజరయ్యారు. విజేతలకు ఆయన నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, ఎంపిటిసి గొంప తులసి, జనపరెడ్డి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. బోగి మంటలు వేసుకుని కోలాటాలు ఆడారు. డూడూ బసవన్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు జుత్తాడ రామసత్యం, ఇప్పాక త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని జాతీయ రహదారి ప్రాంతంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఇప్పాక వెంకట త్రివేణి, రెడ్డి పైడిబాబు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు విశేష స్పందన లభించింది. విజేతలకు గొంప కృష్ణ బహుమతులు అందజేశారు.

శృంగవరపుకోట : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో శనివారం పుణ్యగిరి డిగ్రీ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

వేపాడ.. ముగ్గులను పరిశీలిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు

18న ద్విచక్ర వాహన వేలం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 18న ద్విచక్ర వాహన బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఇబి సిఐ ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని పట్టణంలోని ఎస్ఇబి స్టేషన్ ఆవరణలో వేలం వేస్తామని, ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కొత్తవలస

వసంత విహార్ యూత్, ఎఫ్‌టిపి న్యూస్ ఛైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం రాత్రి ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ రఘువర్మ, వసంత విహార్ అధినేత వల్లూరి జయప్రకాశ్‌బాబు పోటీలను ప్రారంభించారు. సుమారు 22 జట్లు పాల్గొన్నాయి. విశాఖ పోర్ట్ వాలీబాల్ కోచ్ గండి మారయ్య, హరికుమార్ పోటీలను పర్యవేక్షించారు. గులివిందాడ, వడ్డిపేట, దెందేరు జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. వీరికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కర్రి సూర్య నూకరాజు, వసంత విహార్ కమిటీ అధ్యక్షులు ఆర్.వి.రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస.. వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

లింగాలవలసలో క్రికెట్ టోర్నమెంట్

రేగిడి : మండలంలోని పెద్ద లింగాలవలసలో ఆ గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో 21 జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. బెస్ట్ ఆఫ్ త్రీ విధానంతో క్రికెట్ ఆడిస్తున్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ట్రోఫీతో పాటు ఐదు వేల రూపాయలు నగదు, రెండవ బహుమతిగా ట్రోఫీతో పాటు మూడు వేల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి కన్సిలేషన్ బహుమతులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు నెల్లి రామకృష్ణ, కోడి అప్పలనాయుడు, రామకృష్ణ, నాగరాజు, వెంకటేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందలేదని చెబుతున్న ఎరుకలపాకలు గ్రామస్తులు

సంక్రాంతి వచ్చినా అందని రేషన్

ప్రజాశక్తి-బాడంగి

ఎరుకులపాకలు గ్రామంలో ఈ నెల రేషన్ ఇప్పటికీ పంపిణీ చేయలేదు. రేషన్ పంపిణీ వాహనం కోసం ఆ గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పండగ సమీపించినా రేషన్ బియ్యం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతి సంక్రాంతికీ చంద్రన్న కానుక పేరుతో బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరుకులు కూడా ఇచ్చేవారని, వైసిపి అధికారంలోకి వచ్చాక బియ్యం కూడా సరిగా పంపిణీ చేయడం లేదని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు తెలిపారు. అధికారులు స్పందించి ప్రతి నెలా మొదటి వారంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్ ఇసరాపు కృష్ణ మృతి

వేపాడ : మండలంలోని కృష్ణరాయుడుపేట మాజీ సర్పంచ్ ఇసరాపు కృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మరణించారు. ఆ కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నాయకులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామ పంచాయితీ మధుర మెట్టవారి కళ్లాలకు తాగునీటి కుళాయిలను శనివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. కార్యక్రమంలో, ఎస్.కోట ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, స్థానిక సర్పంచ్ ఒబ్బిన త్రినాదమ్మ, ఎంపిటిసి పాదాల ధర్మారావు, వైస్ సర్పంచ్ బర్ల స్వామినాయుడు, మాజీ ఎంపిటిసి శేఖర్, వశి మాజీ సర్పంచ్ శ్రీ కె.వెంకటరావు, నాయకులు ఒబ్బిన సతీష్, అప్పలనాయుడు, గంగేష్, గంగరాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శానిటరీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కార్మికులకు యూనిఫాం, తువ్వాళ్లు, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులను ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చెలికాని మురళి, శానిటరీ ఇన్స్పెక్టర్ శివ, కార్మికులు పాల్గొన్నారు.

'భూ హక్కు'తో రైతులకు మేలు

ఎమ్మెల్యే చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూ హక్కు కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శనివారం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా రాముడువలస రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు వందేళ్ల తర్వాత సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు శాశ్వత మేలు చేకూరుతుందన్నారు. ఇదివరకు ఎప్పుడూ కూడా పట్టాదారు పాసుబుక్కులో లేని భూమి కొలతల పటం, ఎటువంటి నకిలీలకు ఆస్కారం లేని బార్‌కోడ్‌తో భవిష్యత్తులో వివాదాలు తలెత్తవని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశకి-విజయనగరం కోట

ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు శనివారం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. మయూర హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి పండగకు సరిపడా బియ్యాన్ని పలు పేద కుటుంబాలకు అందజేశారు. పేదలను ఆదుకోవడంలో మనసుకు సంతృప్తినిస్తుందని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బిసి నినాదం ఎగసిపడుతోందని అన్నారు. అధిష్టానం ఆదేశిస్తే పోటీలో ఉంటానని తెలిపారు.

బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కాంతారావు

యువతకు స్ఫూర్తి వివేకానంద

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు నిరంతరం స్ఫూర్తిని కలిగిస్తాయని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి.రాజు తెలిపారు. శనివారం మండలంలోని ఎం.బూర్జవలసలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు జి.లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు జి.చంద్రినాయుడు వివేకానంద జయంతిని నిర్వహించారు. కార్పొరేషన్ బ్యాంక్ మేనేజర్ సి.హెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చగలిగే సత్తా యువతకు మాత్రమే ఉందన్నారు. అనంతరం యువత, గ్రామ పెద్దలు.. జెసి రాజు, చంద్రశేఖరరావును సత్కరించారు. ఈ సందర్భంగా జెసి రాజు బూర్జవలస గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, సభ్యులు జె.జనార్ధన్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద బలిజిపేట రోడ్డు మధ్యలో మట్టిదిబ్బ ప్రమాదకరంగా ఉంది. దీంతో రాత్రివేళల్లో కొత్తగా వెళ్లేవారు ఆ మార్గంలో ప్రయాణిస్తే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఎవరైనా ప్రమాదం బారిన పడకముందే మట్టికుప్పను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-మెరక ముడిదాం

మండలంలోని యాడిక గ్రామానికి చెందిన చావు బాలమ్మ శనివారం పాము కాటుకు గురై మృతి చెందింది. బుదరాయ వలస పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాలమ్మ (33) తన పొలంలో వేసిన మొక్క జొన్న పంటను చూడటానికి వెళ్లింది. చేలో పాము కాటు వేయడంతో వెంటనే భర్త శ్రీనుకు తెలియజేసింది. హుటాహుటిన చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లగా మెరుగైన చికిత్స కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలమ్మ మృతి చెందింది.

ఆరుగురు అరెస్టు

రేగిడి : మండలంలోని చాటాయివలస గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి పండగ దాడుల్లో భాగంగా పేకాట ఆడుతున్న ఆరుగురు నుంచి రూ.20వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

బొబ్బిలి : అరటి ఆకులు కొస్తుండగా బాలుడికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. మల్లమ్మపేటకు చెందిన తెంటు అప్పారావు కుమారుడు తెంటు అభినయ్ స్వామివారివీధిలో అరటి ఆకులు కొస్తున్నాడు. అరటి చెట్టుకు విద్యుత్ వైర్లు తాకి ఉండడంతో అభినయ్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

స్వాధీనత ప్రకటన

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
జోనల్ కార్యాలయం : సరస్వతీ కాంప్లెక్స్ 1వ అంతస్తు, ఎస్.వి.సి.థియేటర్ ప్రక్కన, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం.

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి. బెంచ్-చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది. మరియు శ్రీరామ్‌ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొంది కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నది మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032 వద్ద దీని రిజిస్టర్డు ఆఫీసు కలిగి, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్ ను నడుపుటకు ఆర్.బి.ఐ.వద్ద కూడా రిజిస్టరై ఉన్నది, **బ్రాంచ్ ఆఫీస్, విజయనగరం-II బ్రాంచ్,** సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3 లో చదువుకోవల్సిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దీని అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులలో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.

రుణగ్రహీతలు సదరు **(పడాల రామునాయుడు)** మొత్తాన్ని తిరిగి చెల్లించనందున రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8 తో చదువు కోవల్సిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని **10-01-2024** తేదీన స్వాధీన పర్చుకున్నారు.

ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీస్ ప్రకారం బకాయిపడిన మొత్తం	ఋణగ్రహీత తనఖా ఉంచిన స్థిరాస్థి వివరణ
R1. పడాల రాము నాయుడు అప్పల స్వామి, వృత్తి: సుధా ఎంటర్‌ప్రైజెస్, ఆఫీస్ దగ్గర, గజపతి నగరం మండలం, పురిటిపెంట గ్రామం, విజయనగరం జిల్లా-535270. R2. పడాల అరుణ W/o పడాల రాము నాయుడు, వృత్తి: సుధా ఎంటర్‌ప్రైజెస్, MDO ఆఫీస్ దగ్గర, గజపతి నగరం మండలం, పురిటిపెంట గ్రామం, విజయనగరం జిల్లా-535270. R3. బాలి అప్పలనాయుడు సూర్యనారాయణ, R/o టెక్కలి గ్రామం, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా-535003.	రూ.1973151/- (పందొమ్మిది లక్షల డెబ్బై మూడు వేల నూట యాభై ఒక్క రూపాయి మాత్రమే) ఋణ ఖాతా నెం. VZGRMTF1603230002 సూచన క్రింద డిమాండ్ నోటీసు తేదీ: 02.03.2023.	**తనఖా ఉంచిన ఆస్తులు / సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఆస్తులు డాక్యుమెంట్ నెం.670/2016 ప్రకారం గల ఆస్థి** విజయనగరం జిల్లా, గజపతినగరం ఉపజిల్లా, గజపతినగరం మండలం, పురిటిపెంట గ్రామపంచాయతీ మరియు గ్రామ లెక్కదాఖలాలోగల పట్టా నం.231, స.నెం.200/7 మొత్తం విస్తీర్ణం య.1.81 సెంట్లలో దక్షిణం వైపున విస్తీర్ణం య.0.15 సెంట్లు మరియు దాని వరకు మరింత దక్షిణ వైపు విస్తీర్ణం య.0.12 సెంట్లు లేదా 580.8 చదరపు గజాల విస్తీర్ణంతో పాటు ఆర్.సి.సి.భవనంతో పాటు గ్రౌండ్ మరియు 1వ అంతస్తులు బేరింగ్ అసెస్‌మెంట్ నెం.609 & 1394 గల ఆస్థికి సరిహద్దులు : తూర్పు: కర్రౌతు వాసుదేవరావు గారికి చెందిన భూమి, దక్షిణం: ప్రస్తుతం రోడ్డు మండల ప్రజాపరిషత్ ఖాళీ స్థలం, పడమర : ఎమ్. హేమలత గారికి చెందిన ఖాళీ స్థలం, ఉత్తరం: బూర్లె అప్పల నాయుడు గారికి చెందిన షెడ్యూల్ 'బి' లో గల ఆస్థి.

సాధారణ ప్రజానీకం అంతటికి ఈ నోటీసు ద్వారా కూడా హెచ్చరిక చేయునది ఏమనగా, ఇందులో పైన తెలిపిన స్థిరాస్థిపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి చట్టబద్ధమైన స్వాధీనతను కలిగియున్నారు. మరియు ఈ నోటీసు అందిన తరువాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ముందస్తు లిఖితపూర్వ సమ్మతి లేకుండా, ఈ నోటీసులో పైన తెలిపిన ఏదైనా సెక్యూర్డ్ ఆస్థిని అమ్మకం, లీజు లేదా మరేవిధంగాను బదిలీ చేయరాదు, లావాదేవీలు జరుపరాదు / అన్యాక్రాంతములు చేయరాదు.

సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్